వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 62 మంగళవారం | 29 ఆగస్టు 2023 | పేజీలు : 08 | వెల రూ. 5



## గ్యాస్‌పై రూ.200 తగ్గింపు

మహిళలకు రాఖీ పండుగ కానుకగా నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గించింది. దీంతో దేశంలోని 33 కోట్ల మంది వినియోగదారులకు లాభం చేకూరనుంది. దీంతో బీజేపీ నాయకులు స్వీట్లు పంచి సంబురాలు నిర్వహించారు. కాగా రూ.20 పెరిగితేనే రోడ్లెక్కి హంగామా చేసే ప్రతిపక్షాలు ఇప్పుడు ఏమి సమాధానం చెబుతారంటూ బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ ప్రశ్నించారు. - వరంగల్ వాయిస్, వరంగల్



# మారుతున్న 'స్టేషన్' పాలిటిక్స్




## రాజయ్యకు అండగా మాదిగ దండోరా

- ఒక్కటవుతున్న కులస్థులు
- అండగా నిలిచిన ఎంఆర్‌పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ
- నియోజకవర్గంలో 70వేలకు పైగా ఓట్లు తమవే
- చివరి నిమిషంలో టికెట్ తనదేనంటూ ధీమా

స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన తాటికొండ రాజయ్యను కాదని మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి సీఎం కేసీఆర్ టికెట్ కేటాయించడంతో ఒక్కసారిగా రాజకీయ దుమారం చెలరేగింది. రాజయ్యకు అండగా మాదిగ కులస్థులంతా ఒక్కటవుతున్నారు. రాజయ్యకే టికెట్ ఇవ్వాలంటూ ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించడంతోపాటు అంబేద్కర్ విగ్రహాల సాక్షిగా నిరసనలు తెలుపుతున్నారు. అయితే సీఎం కేసీఆర్ గీసిన గీత దాటనంటూనే కడియం శ్రీహరిపై పరోక్షంగా కౌంటర్లకు దిగారు రాజయ్య. రెండు, మూడు రోజుల్లో అనుకున్నది జరుగబోతుందంటూ సంకేతాలు ఇస్తున్నారు. చివరి నిమిషంలో సీఎం కేసీఆర్ మనసు మార్చుకొని టికెట్ తనకే కేటాయిస్తారంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. లేకుంటే బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



## మంత్రి ఇంటి ముట్టడికి యత్నం

- ఆశాలను అడ్డుకున్న పోలీసులు
- ఇరువురి మధ్య తోపులాట
- రూ.18వేల వేతనం అమలు చేయాలంటూ డిమాండ్

2లో

## తల్వార్ తిప్పితే జైలుకే

పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



2లో

## వ్యాపారులకు ప్రభుత్వం అండ

- నగర సుందరీకరణలో భాగస్వాములు కావాలి
- ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్



8లో

మంగళవారం 29, ఆగస్టు 2023
www.warangalvoice.net

# మారుతున్న 'స్టేషన్' పాలిటిక్స్

**రాజయ్యకు అండగా మాదిగ దండోరా**

**ఒక్కటవుతున్న కులస్థులు**

**నియోజకవర్గంలో 70వేలకు పైగా ఓట్లు తమవే**

**అండగా నిలిచిన ఎంఆర్ పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ**

**చివరి నిమిషంలో టికెట్ తనదేనంటూ ధీమా**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్టేషన్ ఘన్ పూర్ నుంచి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన తాటికొండ రాజయ్యకు ఈసారి సీఎం కేసీఆర్ హ్యాండిచ్చారు. దేవుడి దయతో చివరి నిమిషంలో టికెట్ దక్కుతుందని ఎదురుచూసిన ఆయనకు భంగపాటు తప్పలేదు. ఇక్కడి నుంచి మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని బరిలోకి దింపాలని అధిష్ఠానం నిర్ణయించడంతో ఒక్క సారిగా రాజకీయ దుమారం చెలరేగింది. ఇప్పటివరకు ఉప్పు..నిప్పులా వ్యవహరించిన వీరిద్దరిలో కడియంకు టికెట్ కేటాయించడంపై రాజయ్య మద్దతుదారులు మండిపడుతున్నారు. బీఆర్ ఎస్ బలోపేతానికి శ్రమించిన రాజయ్యకు కేసీఆర్ అన్యాయం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## లైంగిక ఆరోపణలే కారణమా..?

జానకీపురం సర్పంచ్ నవ్య లైంగిక ఆరోపణల వ్యవహారం తాటికొండ రాజయ్య ఇమేజ్‌ని బాగా దెబ్బతీసింది. నవ్య ఎపిసోడ్ రచ్చకెక్కడం, మీడియా, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం అధిష్టానం దృష్టికెళ్లింది. ఇదే సమయంలో కడియం శ్రీహరి వ్యూహాత్మకంగా వ్యవహరించి రాజయ్యను దెబ్బకొట్టారు. ఈసారి స్టేషన్ ఘన్ పూర్ టికెట్ తనకు ఇస్తే గెలిపించి చూపిస్తానని హామీ ఇవ్వడంతో బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ కడియం వైపు మొగ్గు చూపారు. దీంతో బీఆర్ఎస్ మొదటి జాబితాలోనే కడియం శ్రీహరి పేరు ప్రకటించారు.

## రాజయ్యకు పెరిగిన సానుభూతి..

జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై సానుభూతి పెరుగుతోంది. స్టేషన్ ఘన్ పూర్ బీఆర్ ఎస్ టికెట్ కడియం శ్రీహరికంటూ ప్రకటన వెలువడడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. శ్రీహరికి ఎమ్మెల్సీ ఉన్నప్పటికీ టికెట్ కేటాయిస్తూ సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనను నిజమైన మాదిగలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ సారి కూడా రాజయ్యకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే బీఆర్ ఎస్ కు ఓటమి తప్పదంటూ హెచ్చరిస్తున్నారు. రాజయ్యను ఇండిపెండెంట్ గానైనా గెలిపించుకుంటామంటున్నారు.



స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో 70వేలకు పైగా ఓట్లు తమవేనంటూ ప్రకటిస్తున్నారు. దళిత దొరకు ఎట్టి పరిస్థితిలో ఓటు వేసేది లేదని 'దండోరా' బ్యాచ్ అంటున్నది.

## ఎమ్మార్పీఎస్ మద్దతు..

స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు ఎమ్మార్పీఎస్ మద్దతుగా నిలిచింది. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో కలిసి రాజయ్య రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ సమాజం అంతా రాజయ్యకు అండగా నిలుస్తామంటూ హామీ ఇచ్చారు. దొరల పాలనలో మాదిగలకు అన్యాయం జరుగుతోందని మండి పడ్డారు. మాదిగల అస్తిత్వం కోసం అహర్నిశలు కృషి చేసిన రాజయ్య వెంటే మేముంటామంటూ ప్రకటిస్తున్నారు.

## ప్రజా క్షేత్రంలోనే ఉంటా..

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశించిన సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు చుక్కెదురైంది. ఈ స్థానంలో మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని బరిలోకి దింపాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. దీంతో దేవుడి దయతో చివరి నిమిషంలో టికెట్ తనకే దక్కుతుందని ఎదురుచూసిన రాజయ్యతోపాటు ఆయన అనుచరులకు భంగపాటు తప్పలేదు. తీవ్ర నిరాశకు లోనైన తాటికొండ రాజయ్య భవిష్యత్ కార్యచరణపై దృష్టి సారించారు. ఇప్పటికే రంగంలోకి దిగిన ఆయన ఆరు నూరైనా ప్రజాక్షేత్రంలోనే ఉంటానంటూ స్పష్టం చేశారు. దుక్కి దున్ని, నారు పోసి, కలుపుతీసి, పంట పండించి, కుప్ప పోశాక.. ఆ కుప్ప మీద ఎవరో వచ్చి కూర్చుంటానంటే ఊర్కుంటామా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రజల కోసమే తానున్నానని.. ప్రజల మధ్యలోనే చచ్చిపోతానంటూ చెప్పుకొచ్చారు. ఇప్పటికే తన ద్వారా లబ్ధి పొందిన వారిని ఒక్కతాటి మీదకు తెస్తున్నారు. పైన దేవుడున్నాడు.. ఇక్కడ దేవుడి లాంటి కేసీఆర్ ఉన్నారు.. రేపోమాపో తాను అనుకున్న కార్యక్రమం జరుతుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ ఘన్ పూర్ అభ్యర్థి విషయంలో కేసీఆర్ తప్పక మనసు మార్చుకుంటారంటున్నారు.

## సమాలోచనలు..

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై తాటికొండ రాజయ్య సమాలోచనలు చేస్తున్నారు. బీఆర్ ఎస్ నుంచి ఫిఫ్టీ..ఫిఫ్టీ అవకాశాలే ఉన్నందుకు కాంగ్రెస్ పార్టీ లేదా బీఎస్పీ నుంచి పోటీ చేసేందుకు పావులు కదుపుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజయ్య మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. సీఎల్పీ లీడర్ భట్టి విక్రమార్కతో టచ్ లో ఉన్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఉద్యమ సమయంలో రాజయ్య కాంగ్రెస్ పార్టీ వీడినప్పటికీ మళ్లీ ఆ పార్టీలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మరో వైపు బీఎస్పీ స్టేట్ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజయ్యకు అండగా ఉంటామని ఇదివరకే ప్రకటించారు. ఆయన కోరితే పార్టీ టికెట్ ఇస్తామని భరోసా ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ నుంచి వీలుకాకుంటే బీఎస్పీ నుంచైనా పోటీ చేసే చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

# మంత్రి ఇంటి ముట్టడికి యత్నం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇంటిని ముట్టడించేందుకు యత్నించారు. అయితే దీనిని గుర్తించిన పోలీసులు మంత్రి ఇంటికి భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు అటువైపు వచ్చిన ఆశాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు సీఐటీయూ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పలువురు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. మంత్రి ఇంటి ముట్టడికి ముందు హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా మంత్రి ఇంటి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి మాట్లాడుతూ గడిచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశలకు కనీస వేతనాన్ని అమలు చేస్తామని చెప్పి కాలయాపన చేసిందని విమర్శించారు. పారితోషికాలు కాకుండా కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని కోరారు. 18 సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేస్తున్నా ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించడంలేదని ఆరోపించారు. టీబి, లెప్రసీ, కంటి వెలుగు తదితర ప్రభుత్వ పథకాలకు చెందిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి 1,000 మంది జనాభా కి ఒక ఆశా వర్కర్ ను నియమించాలని కోరారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్కు అలవెన్స్ నెలకు రూ.1000 చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని, 32 రకాల రిజిస్టర్స్ ను వెంటనే ప్రభుత్వం ప్రింట్ చేసి సప్లై చేయాలని ఈ సందర్భంగా రాగుల రమేష్, బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. క్వాలిటీ తో కూడిన ఐదు పెండింగ్ యూనిఫారం లు వెంటనే ఇవ్వాలని, ఆశలకు ప్రసూతి సెలవుల పైన సర్క్యులర్ జారీ చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన ఆశలకు ఏఎన్ఎం లుగా పదోన్నతి కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సారంగపాణి, నాయకులు ఎన్.రజిత, కన్నూరి కల్పన, కె.పద్మ, గొర్రె పుతిలి, ఎం.జ్యోతి, ఎల్.సంధ్య, సీహెచ్ రాజేశ్వరి, సీహెచ్ శ్రీవాణి, ఎస్.రమ, యాకూబీ, బొక్క సునంద, రజినీ, ఎస్.పద్మ, మాచర్ల రజిత, సుమలత లతో పాటు వందలాదిమంది ఆశాలు పాల్గొన్నారు.



# తల్వార్ తిప్పితే జైలుకే: ఏవీ రంగనాథ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బహిరంగ ప్రదేశాల్లో తల్వార్(కత్తి)ను ప్రదర్శించడంతో పాటు ఎలాంటి ప్రదర్శనలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. ఇటీవల వరంగల్ కమిషనరేట్ పరిధిలో తల్వార్లు, కత్తుల సంస్కృతి పెరిగిపోవడంతో పాటు, కొంత మంది వ్యక్తులు వాటితో యథేచ్ఛగా తిరుగుతూ ఫొటోలకు ఫోజులు ఇస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడంపై సీపీ దృష్టి సారించారు. వేడుకల సందర్భంగా తల్వార్లు లేదా కత్తులతో కేకులను కట్ చేస్తున్నట్లుగా దిగిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో పాటు వాటిని పట్టుకొని ఉన్న ఫోజులతో దిగిన ఫొటోలతో కూడిన ప్లెక్సీలను కూడళ్ళల్లో ఏర్పాటు చేయడం లాంటి చర్యలకు పాల్పడితే వారిపై భారతీయ శిక్షాస్మృతి ఆయుధాల చట్టం క్రింద కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రధాన రోడ్డుపై ద్విచక్ర వాహనాలను నిలిపి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించుకున్నా చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. ఏవరైన వ్యక్తులు బహిరంగంగా తల్వార్లతో ప్రదర్శన ఇస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీపీ ప్రజలను కోరారు.

## ఇద్దరు అరెస్ట్..

వరంగల్ నగరంలో గత రెండు రోజుల క్రితం ఓ బార్ షాప్ లో తల్వార్ తో హల్చల్ చేసిన వ్యక్తిని ఇంతేజార్ గంజ్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి తల్వార్ ను స్వాధీనం చేసుకున్నారు.

# డీఈఓను కలిసిన వడుప్సా జిల్లా కమిటీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ట్రస్మా వడుప్సా వరంగల్ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ డీఈఓ వాసంతిని మర్యాదపూర్వకంగా హనుమకొండలోని కార్యాలయంలో కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా (వడుప్స) వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎ.వీరస్వామి, ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, సలహాదారులు కొడెం శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.సతీష్ కుమార్, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్, జోన్ ప్రధాన కార్యదర్శి దాసి సతీష్ మూర్తి, వరంగల్ జోన్ ఉపాధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వానిది మొద్దు నిద్ర

## మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ చాలా కీలకమైనదని అలాంటి శాఖ ఉద్యోగులు 14రోజులుగా సమ్మె చేస్తుంటే, ప్రభుత్వం మొద్దు నిద్రపోవడం శోచనీయం అని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. మంగళవారం పరకాల నియోజకవర్గంలోని రెండవ ఏఎన్ఎంలు సెప్టెంబర్ 2న జరిగే సమ్మెకు మద్దతు ఇవ్వాలని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి నివాసంలో కలసి మెమోరడం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యశాఖ చాలా కీలకమైందని, అందులో పని చేసే వారందరికీ న్యాయం చేయాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రతి ఒక్క ఉద్యోగిని మోసం చేస్తున్న కేసీఆర్ అని అన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రతి ఒక్క ఉద్యోగి రోడ్డు ఎక్కి తమ హక్కుల కోసం ఉద్యమాలు చేసుకునే పరిస్థితి దాపురించిందని, ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం తెలంగాణ గద్దెనెక్కి ప్రతి ఒక్క ఉద్యోగికి న్యాయం చేస్తుందని, ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎంలు సునీత, రజిత, భాగ్యలక్ష్మి, కరుణ, కల్పన, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనుల ప్రారంభం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని ఆలేరు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం గ్రామ సర్పంచి కాలేరు త్రివేణి, పంచాయతీ సెక్రటరీ జలీల్ పాషా ప్రారంభించారు. గ్రామంలోని మూడో వార్డు బొడ్రాయి సెంటర్ నుంచి ఎర్రగుంటకు వెళ్లే మార్గం వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గూదే గోవర్ధన్, వాలేరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు కింద పడి బాలుడి మృతి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని చంటయ్యపల్లి గ్రామం వద్ద మంగళవారం ఉదయం స్కూల్ బస్సు కింద పడి బాలుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన చోటు చేసుకుంది. చంటయ్యపల్లి గ్రామానికి చెందిన దండవేన శరత్ -మమత దంపతుల పెద్ద కుమారుడు సాన్విక్ గట్లనర్సింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. రోజు సాన్విక్ స్కూలుకు బస్సు లో వెళుతున్న క్రమంలో రోజు లాగానే మంగళవారం తన కొడుకును బస్సు ఎక్కిస్తుండగా చిన్న కుమారుడు శివాన్ష్(3) వెంట వచ్చాడు. శివాన్ష్? బస్సు ఎదురుగా పరిగెత్తాడు. డ్రైవర్ బస్సును కదిలించడంతో ముందు టైర్ కింద పడిన శివాన్ష్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారని ముల్కనూరు ఎస్సై సాయిబాబు తెలిపారు.

## దళితులందరికీ దళిత బంధు వర్తింప చేయాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో డీవైఎఫ్ఐ, ఏబీఎస్ఎఫ్, బహుజన సంక్షేమ సంఘం(బీఎస్ఎస్) నాయకులు దళిత బంధు పథకాన్ని ప్రతి దళిత కుటుంబానికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల దళిత ప్రజలు పాల్గొన్నారు. అనంతరం వివిధ సంఘాల ఆధ్వర్యంలో శాయంపేట ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీవైఎఫ్ఐ ఏబీఎస్ఎఫ్ బహుజన సంక్షేమ సంఘం బీఎస్ఎస్ నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ హుజురాబాద్ తరహాలో ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు పథకం వర్తించేలా అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాయంపేట మండల పరిధిలో ఉన్నటు ప్రతి దళిత కుటుంబాలకు దళిత బంధు పథకం చేరే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ పథకం ఎంపికలో అధికార పార్టీ నాయకుల చొరవ ప్రమేయం లేకుండా చూడాలన్నారు. లేనిపక్షంలో అన్ని దళిత సంఘాలను ఏకం చేసి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ను ముట్టడిస్తామని, అధికార పార్టీ ఎమ్మెల్యేకు రానున్న రోజుల్లో ఓట్లతో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## ఘనంగా గిడుగు రామమూర్తి, ధ్యాన్ చంద్ జయంతి



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలుగు భాషను వ్యవహారిక భాషగా అందించిన గిడుగు రామమూర్తి జయంతి, భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతులను పురస్కరించుకొని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం మంగళవారం అమరధామంలో వారి చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిడుగు రామమూర్తి తెలుగు భాష వ్యాప్తి కోసం సమాజానికి చేసిన సేవలను, అలాగే భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ యువకులను హాకీ క్రీడాకారులుగా తీర్చిదిద్ది, హాకీ క్రీడను జాతీయ స్థాయిలో నిలుపుట కోసం చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ మడికొండ శ్రీను, మునిసిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, కౌన్సిలర్లు నల్లెల జ్యోతి అనిల్, మార్త ఉమాదేవి రఘుపతి గౌడ్, బీఆర్ఎస్ పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి దుప్పటి సుజయ్ రాణా, జయశంకర్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొట్ల రవి సామ్రాట్, బీఆర్ఎస్ నాయకులు గోవింద్ కుమార్, పసుల శ్రీనివాస్, మడికొండ సాంబయ్య, బొచ్చు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## జానయ్య యాదవ్ పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** మంత్రి జగదీశ్వర్ రెడ్డి ప్రజా క్షేత్రంలో నేరుగా జానయ్య యాదవ్ ను ఢీకొట్టే ధైర్యం లేక ఉమ్మడి నల్లగొండ జిల్లా ఒట్టే జానయ్య యాదవ్ పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు, ఆల్ యూనివర్సిటీ ఇంచార్జి ఆరేగంటి నాగరాజు మండిపడ్డారు. ఒక బీసీ బిడ్డ ప్రజాబలంతో రాజకీయంగా ఎదుగుతుంటే కావాలనే అగ్రవర్ణ రాజకీయ నాయకులు నీచపు రాజకీయాలు, చిల్లర రాజకీయాలు చేసుకుంటూ బీసీలను అణగదొక్కాలని కుట్రలో భాగంగా జానయ్యపై భూ కబ్జా నిందలు మోపి పోలీసులను అడ్డుపెట్టుకొని అరెస్టు చేయించడం సరికాదన్నారు. 24 గంటల్లో జానయ్య యాదవ్ ఎక్కడున్నా వారి కుటుంబానికి అప్పజెప్పాలని రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఎక్కడ తిరిగినా అక్కడ అడ్డుకుంటామన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకుడు



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోలినేని స్వామిరావు మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీపై నమ్మకంతో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మునిగాల సురేందర్ రావు, విజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం



**వరంగల్ వాయిస్, సుబేదారి :** "జాతీయ క్రీడా దినోత్సవం " సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో మంగళవారం తలసేమియా బాధితులను కాపాడేందుకు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి అతిథులుగా రెడ్ క్రాస్ పాలకవర్గం విచ్చేసి ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లాడుతూ "జాతీయ క్రీడా దినోత్సవం " జరుపుకోవడం వల్ల క్రీడల బాధ్యత అందరికి తెలుస్తుందని, క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, దృఢమైన మానసిక స్థిరత్వం లభిస్తుందని వివరించారు. క్రీడలపై యువత దృష్టి సారించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించి ఉజ్వల భవిష్యత్తు అందుకోవాలని అన్నారు. తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), గుల్లపెల్లి శివ కుమార్ ఆర్గనైజర్లను, రక్తదాతలను రెడ్ క్రాస్ పాలకవర్గం పక్షాన అభినందించారు. ఈ రక్తదాన శిబిరం లో 40యూనిట్ల రక్తాన్ని సేకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి.శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, మురుగన్ యార్డ్స్ బొడ్డ రవీందర్ నాథ్, బొట్టు కమలాకర్ , గజ్జెల సుమన్ , ఉప్పరపెల్లి రాజ్ మార్, కొలిపాక ప్రకాష్, ఎస్.కె ముస్తఫా, ఊరటి రవికుమార్, పోలీస్ కానిస్టేబుల్ పసునుటి రమేష్, కానిస్టేబుల్ చంద్రశేఖర్, ప్రేమ్ కుమార్, వెంకట్, శివ, నరేష్ , అర్జున్, నవీన్ కుమార్, సాయికుమార్, మహేష్, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, జీవితకాల సభ్యులు కుసుమ శ్యామసుందర్, రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ టి. మదన్మోహన్ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది ఎ.సురేష్, జి.సునీత, బి.స్వప్న, రక్తదాతలు పాల్గొన్నారు.

మంగళవారం 29, ఆగస్టు 2023
www.warangalvoice.net

# ధరణి వద్దంటున్నకాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలి

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** ధరణిని వద్దంటున్న కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గీసుగొండ మండలంలోని గీసుగొండ, రాంపూర్, కొనాయిమాకుల గ్రామాలలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన 1477రైతులకు గాను రూ.1కోటి 95లక్షల 30వేల 750విలువైన నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ధరణిని వద్దంటున్న కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో సరైన వాళ్లను గెలిపించుకుంటే మన తలరాతను మనమే మార్చుకోవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ ఇప్పుడిప్పుడే అన్ని రంగాల్లో కేసీఆర్ పాలనలో బాగుపడుతుందని అన్నారు. సబ్బండ వర్గాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే అది కేసీఆర్‌తోనే సాధ్యమని అన్నారు. రైతు బాంధవుడు కేసీఆర్ కావాలా? వ్యవసాయం తెలియని కాంగ్రెస్, బీజేపీ కావాలో ఆలోచన చేయాలని ప్రజలకు సూచించారు. ఢిల్లీ పార్టీ కావాలా? ఇంటి పార్టీ కావాలో ఆలోచన చేయాలని కోరారు. కేసీఆర్ ఏనాడూ మాట తప్పలేదని, అనునిత్యం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తూ రైతులు చనిపోతే దేశంలో ఎక్కడ కూడా పట్టించుకునే వారు లేరన్నారు. కానీ, తెలంగాణ ప్రభుత్వం రైతు బీమా ఇచ్చి ఆదుకుంటుందని తెలిపారు. ఉద్యమ సమయంలో ఒక గిరిజన సోదరుడు పడ్డ కష్టాన్ని గుర్తించిన రూపొందించిన పథకమే కల్యాణ లక్ష్మీ అని వివరించారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఇచ్చే పథకం దేశంలోనే చరిత్ర సృష్టిందని అన్నారు. కులమతాలతో రాజకీయం చేసేవారిని నిలదీయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఎకరాకు పదివేలు అందిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి నేడు కేసీఆర్ ఒక్క గీసుగొండ మండలంలోనే 10975మంది రైతులకు గాను రూ.11కోట్ల 12లక్షల 10వేల 5వందలు మంజూరు కావడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడ ఏ ప్రభుత్వం పంట నష్టపరిహారం అందివ్వలేదని, ఒక్క కేసీఆర్ తప్ప.. ధరణిని బంగాళాఖాతంలో పడేద్దామని, వ్యవసాయానికి 3గంటల కరెంట్ చాలని, మోటార్లకు మీటర్లు పెట్టాలని కాంగ్రెసోళ్లు,బీజేపోల్లు సోయి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ధరణి వద్దంటున్న కాంగ్రెసోళ్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో సరైన వాళ్లను గెలిపించుకుంటే మన తలరాత మనం మార్చుకోవచ్చని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దేశానికే ఆదర్శంగా మన సంక్షేమ పథకాలు నిలిచాయన్నారు. దేశానికే ఆదర్శంగా మన తెలంగాణ రాష్ట్రాన్ని నిలిపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై, కేసీఆర్ పై తెలంగాణ ప్రజల్లో అపారమైన నమ్మకముందని అన్నారు. పార్టీలకు అతీతంగా పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఆదరణ చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేస్తున్నాయని, వారికి ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్ఎంల సేవలు అనిర్వచనీయం

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ గత 15 రోజులుగా తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న ధర్నా కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి సంఘీభావం తెలిపారు. హనుమకొండ ఆటోనగర్ లోని డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ధర్నాలో మంగళవారం ఆయన పాల్గొని సంఘీభావం తెలపడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని, అందులో ఆరోగ్య ఉద్యోగుల త్యాగాలు అనిర్వచనీయం అన్నారు. కానీ ప్రత్యేక తెలంగాణ వచ్చిన తర్వాత కాంట్రాక్ట్ ఉద్యోగి అన్న పదమే లేకుండా చేస్తా అన్న కేసీఆర్ మాట తప్పి ఏఎన్ఎంల ఉసురు పోసుకుంటున్నారని దుయ్యబట్టారు. 24ఐ7 ప్రజారోగ్యం కోసం క్షేత్ర స్థాయిలో పని చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండేది, ప్రజల ప్రజలను కాపాడేది ఏఎన్ఎంలేనని అన్నారు. ఏఎన్ఎంలు ఎవరి దయా దాక్ష్యాన్యాల మీద ఆధారపడాల్సిన అవసరం లేదని, వారు పడ్డ కష్టానికి ఏమిచ్చినా తక్కువే అన్నారు. కరోనా కష్ట కాలంలో ప్రపంచం గడగడలాడుతుంటే ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడటంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. బీజేపీ పక్షాన మీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ మానిఫెస్టో లో సైతం మీ డిమాండ్లు పొందుపర్చేలా పార్టీ పెద్దలలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య మంత్రి హరీష్ రావుకు ఏఎన్ఎంలు తమ గోడు చెప్పుకుందామని వెళ్తే వారు వ్యవహరించిన తీరును ఏఎన్ఎంలు చెప్తుంటే బాధ కలిగిందన్నారు. ప్రభుత్వం మెడలు వంచడానికి మీరు ఏ ఉద్యమం చేపట్టినా మీకు అండగా బీజేపీ ఉంటుందని హామీ ఇచ్చారు.

# ప్రజలకు అండగా ఉంటా

## బీజేపీ నేత డాక్టర్ కాళి ప్రసాద్



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** పరకాల నియోజకవర్గం ప్రజలకు ఆపదలో నేనుంటానని బీజేపీ నాయకులు డాక్టర్ కాళి ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన బొల్లం జయలక్ష్మి అనారోగ్యంతో మృతిచెందగా ఆమె భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ ప్రజలకు నేనున్నానని, ప్రజల కష్టాలలో నేను ముందుండి సేవ చేస్తానని తెలిపారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు ఇడ్సర్ల సదానందం, బీజేపీ నాయకులు భయ్యా పైడి, మాడిశెట్టి రవి, పాహిరాల రాజేందర్, గొల్లపల్లి వెంకటేశ్వర్, పూజారి సత్యనారాయణ, వాసం సురేష్, బీజేపీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ప్రతి రైలుకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలి

## వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట పీవైఎల్ ధర్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రైలు ప్రయాణాలను ఉపయోగించుకుంటున్న ప్రయాణికులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట ఆ సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం వరంగల్ రైల్వే మేనేజర్ బి.బాలరాజుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. విజయవాడ –సికింద్రాబాద్– బల్లార్షా జంక్షన్లకు మధ్య వారధిగా ఉన్న వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికులు ప్రతిరోజు వేలాదిమందిగా ప్రయాణిస్తారని, వారికి రైళ్లలో తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ సంఘం నాయకులు వివరించారు. 50ఏళ్ల కాలంలో ప్రయాణికుల సంఖ్య పెరిగినప్పటికీ దానికి తగ్గట్టుగా రైల్వే కోచ్ లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రోజువారి ప్రయాణాలు కష్టతరంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ లో ఆగే ప్రతి రైలుకు ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు కోచ్ లు ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ అధికారులను వారు డిమాండ్ చేశారు. రైల్వే శాఖ ప్యాసింజర్ రైలు టికెట్లను పెంచడంతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడిందని, టికెట్ల రేటు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. మరికొన్ని ప్యాసింజర్ రైళ్లను ఎక్స్ ప్రెస్ రైలుగా మార్చడం వల్ల ఈ మార్గంలో ప్రయాణికులకు రైళ్లను ప్రయాణికులు ఉపయోగించుకోలేకపోతున్నారని వారు అన్నారు. తిరిగి ప్యాసింజర్ గా మార్చాలని వారు డిమాండ్ చేశారు. స్థానికంగా రైల్వే స్టేషన్ లో వాహనాల పార్కింగ్ రేట్లను అధికంగా పెంచారని ఈ రేట్లు వెంటనే తగ్గించాలని వారు రైల్వే శాఖ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, పీవైఎల్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి దినసరి సురేష్, ఉపాధ్యక్షుడు సుమన్, సహాయ కార్యదర్శి గంద్రతి హరిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు రంజిత్, విష్ణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పులిగిల్ల గ్రామంలో దయ్యాల కార్తీక్ భార్య దయ్యాల అనూష మరణించగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పరకాల మండలాధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి మంగళవారం ఆమె పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి, నివాళులర్పించి, సంఘీభావం తెలియజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మీ కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు బల్లు రమేష్, మంద నాగరాజు, అల్లం రఘునారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మ కంటి చంద్రమౌళి, మాచపోయిన అజయ్, కట్టగాని రాకేష్, ఉడుత సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకశిలలో జాతీయ క్రీడా దినోత్సవం



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి:** మండలంలోని పెంబర్తి ఏకశిలా టెక్నో స్కూల్ లో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిపారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే క్రీడా జాతీయ దినోత్సవంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సంవత్సరం క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులను ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధించాలనే పట్టుదల ఉన్న విద్యార్థులతో పాటు మంచి నైపుణ్యం కలిగి చక్కని శిక్షణ ఇచ్చే ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులు ఉండడం వలన గత కొన్ని సంవత్సరాలుగా వివిధ క్రీడాంశాలలో ఏకశిలా విద్యార్థుల విజయ పరంపర కొనసాగుతుందని తెలిపారు. గౌరు సువిజా రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కేడీ స్వర్ణ రాజ్, జి.రాంప్రసాద్, ఏ.రవి, దేవేందర్, రాజేందర్, ప్రశాంత్, కల్పశ్రీ, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బోనుకు చిక్కిన కోతులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ ఇండ్లలోకి చొరబడి వస్తువులను చిందర వందర చేస్తున్నాయని ఫిర్యాదులు వచ్చినందున మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 210కోతులను పట్టుకు వెళ్లడం జరుగుతుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. మంగళవారం ఉర్సు కబ్రస్థాన్ లో ఇటీవల నెల్లూరు జిల్లాకు చెందిన వారు ఏర్పాటు చేసిన బోనులో 210కోతులు చిక్కుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్ స్పెక్టర్ వెంకన్న, జవాన్లు సతీష్, ప్రశాంత్, దాసరి నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

# దివ్యాంగులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** దివ్యాంగులాకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిచిందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మంగళవారం గీసుగొండ మండలంలోని ఎస్-ఎస్ గార్డెన్స్ లో గీసుగొండ, సంగెం మండలాలకు చెందిన దివ్యాంగులతో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్ రూ.4016 చేస్తూ ఇచ్చిన మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు అండగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిచారన్నారు. వైకల్యం అనేది శరీరానికే గానీ లక్ష్యానికి, మనసుకు కాదని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. తెలంగాణ ఎక్కడ ఉన్నది అనే స్థితి నుంచి ప్రపంచమంతా తెలంగాణ వైపే చూసే స్థితికి చేరిందన్నారు. తిండిలేక ఇబ్బందిపడ్డ తెలంగాణ దేశానికే అన్నం పెట్టే స్థాయికి చేరిందన్నారు. 60ఏండ్ల కాంగ్రెస్ పాలనలో జరగని అభివృద్ధి తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిందని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్టం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అడ్డుపడుతున్నారని దయ్యబట్టారు. బీజేపీ నాయకులు గ్రామాలలో కనిపిస్తే తెలంగాణకు ఏమిచేసారో చెప్పాలని నిలదీయాలని ప్రజలకు సూచించారు. దశాబ్దాల కాలం పాలించిన కాంగ్రెసోళ్లు సోయి తప్పిన మాటలు మాట్లాడుతున్నారు. నియోజకవర్గంలో ఏర్పాటవుతున్న కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో దివ్యాంగులకు కూడా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డీఓ, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, కమిటీ సభ్యులు, ఎంపీడీఓలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పత్తిలో సస్య రక్షణ పద్ధతులపై అవగాహన



**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా వారి సహకారంతో నిర్వహిస్తున్న బెటర్ కాటన్ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్ లో భాగంగా పోచంపల్లి గ్రామంలో రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రేగొండ ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ క్షేత్ర సహాయకులు శ్రీహరి మాట్లాడుతూ పత్తి పంటలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటిస్తూ, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవాలి అని, అధికంగా ఎరువులు, పురుగు మందులు వాడి నేలను, పర్యావరణాన్ని కలుషితం కాకుండా బీసీఐ రైతులు చూడాలని, మన పూర్వీకులు మనకు ఎలాంటి భూమిని ఇచ్చారో, మనం కూడా భవిష్యత్ తరాలకు, అలాంటి సారవంతమైన భూమిని అందించాలని, అందుకు నేల పునరుత్పాదాక వ్యవసాయ పద్ధతులు పాటించాలని చెప్పడం జరిగింది. బెట్ట వాతావరణ పరిస్థితులలో పంటకు పైపాటుగా 19:19:19 అందించాలని, పంటకు నీరు అందించే సమయంలో సాలు విడిచి సాలు పద్ధతి పాటించాలని, పురుగు మందులు పిచికారి చేసే వ్యక్తులు 18సం.నిండి ఉండి, పిచికారి సమయంలో శరీరభాగాలు పూర్తిగా కప్పి ఉంచే విధంగా సరైన రక్షణ దుస్తులు ధరించాలని, ఖాళీ పురుగు మందు డబ్బాలను గ్రామంలో ఉన్నటు డంపింగ్ యార్డులో వేయాలని, నేల కోతకు గురయ్యే ప్రదేశాలలో మొక్కలు నాటుకోవాలని మొక్కలను కూడా సంస్థ నర్సరీ నుంచి రైతులకు అందించడం జరుగుతుందని, కార్మిక చట్టం 138 ప్రకారం 18ఏళ్ల లోపు వారు హానికరమైన పనులు చేయరాదని (యంత్రాలను నడపడం, పురుగు మందులు పిచికారీ చేయడం, పదునైన వస్తువులతో పని చేయడం), ఆడ, మగ తేడా లేకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కూలీలను తీసుకునే సమయంలో వివక్ష చూపరాదని, నిషేదించిన పురుగు మందులు, గడ్డి మందులు వాడకూడదని గ్రామంలో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయ నిపుణులు కంజుల మహేష్, రైతులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

## బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ** :కాంట్రాక్టు ఉద్యోగ పద్ధతిని రద్దుచేసి రెగ్యులరైజ్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం బాలసముద్రం ఏకాశిలా పార్క్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలకు హనుమకొండ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది.ఈ సందర్భంగా హాజరైన జిల్లా అధ్యక్షులు శనిగరపు రాజు మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్ర శిక్షలో ఒప్పంద పద్ధతిలో జిల్లా కార్యాలయాల్లో వివిధ హెూదాల్లో పనిచేస్తున్న 21000లకు పైగా ఉన్న ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని, 2018 ఎన్నికల మేనిఫెస్టోలో కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మంజుల, మనీ, జిల్లా కోశాధికారి పసుపు నాటి నితీష్, పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి ఎండీ మినాజ్, అధ్యక్షుడు బొట్ల నితిన్, పరకాల నియోజకవర్గం ఇంచార్జ్ పసుల వినయ్, అంబేడ్కర్, వందలాది మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రగతి పథంలో తూర్పు నియోజకవర్గం

## ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో వరంగల్ తూర్పు నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందుంచుతున్నామని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. నియోజకవర్గంలోని 22వ డివిజన్ లో రూ.2కోట్ల 98లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు 22వ డివిజన్ ఇంచార్జి విజయ్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధిస్తున్నదని పురపాలన శాఖ మంత్రి కేటీఆర్ మార్గ నిర్దేశంలో ఈ నియోజకవర్గ రూపురేఖలు మారుస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో నాలుగు వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, 24అంతస్తుల మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జిల్లా కేంద్రం కలెక్టరేట్ నూతన బస్ స్టేషన్, ఇంటిగ్రేటర్ మార్కెట్లు వాడవాడనా సీసీ రోడ్లు ఏర్పాటు చేసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విదంగా ప్రధాన రహదారులన్నీ గొప్పగా మార్చామని, గత పాలకుల హయాంలో అభివృద్ధికి నోచుకోని ఓరుగల్లు తూర్పు తాను ఎమ్మెల్యే అయ్యాక నేడు ఏ విదంగా ఉందొ ప్రజల కళ్ల ముందు కనపడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచి తనకు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 22వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మావురపు గీత విజయ భాస్కర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శివ, బీఆర్ఎస్ నాయకులు ఆడెపు రవీందర్, రమేష్ గౌడ్, చిట్టిమల్ల రమేష్ బాబు, పెంచల గోపన్న, తోట తిరుపతయ్య, రావులపల్లి వీరన్న, పక్రోద్దీన్, పాక సుధాకర్, చిప్ప వెంకటేశ్వర్లు, సోల రవి, జను ప్రమోద్, జూపాక సురేష్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# 'నాగుర్ల'కే బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని స్వర్ణ గార్డెన్ లో పరకాల నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని కోరుతూ వివిధ సంఘాల నాయకులతో సందెల సునీల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001 నుంచి నాగుర్ల వెంకన్న తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వాళ్లలో ఒకరని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి కుల సంఘాల నాయకులు, బహుజనులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు లేకుండా ఎలా గెలుస్తారని, అన్ని సామాజిక వర్గాల ప్రజలు నాగుర్ల వెంటే ఉన్నారని తెలిపారు. ఆరే సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్ మాట్లాడుతూ నాగుర్ల వెంకన్న అధిష్టానం చెప్పిన ప్రతి పనిని తూచా తప్పకుండా పాటించారని, కేసీఆర్ పరకాల నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని, మొదటి నుంచి తెలంగాణ ఉద్యమంలో ఉన్న వ్యక్తి నాగుర్ల అని, తెలంగాణ రాష్ట్రంలో ఆరే సామాజిక వర్గానికి ఒక సీటు కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. 103కులాలు ఉన్న వారికి 22సీట్లు ఇచ్చి, రెండు కులాలు ఉన్న వారికి 56సీట్లు ఎలా ఇచ్చారని నిలదీశారు. అనంతరం ఆత్మకూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చల్లా ధర్మారెడ్డి అనంతట తాను తప్పుకోవాలని లేనియెడల బహుజనులందరం కలిసి ఎమ్మెల్యే చల్లాను ఓడిస్తామని, ధర్మారెడ్డి రూ.2000 కోట్లు, 2000 ఎకరాలు సంపాదించారు.. తప్పు, ఎవరికి న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజనుల బతుకులు మారాలంటే బహుజన బిడ్డ నాగుర్ల వెంకన్నకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగూర్ల శంకర్రావు, గుండెకారి రంగారావు, హింగే శివాజీ, వంచనగిరి వీరేశం, ఇంగ్లీ శివాజీ, గుర్రం రఘు, బాబుమియా, చిరంజీవి, హెండిగా శ్రీనివాస్ వంచనగిరి వీరేశం, ఇంగ్లీ శివాజీ, గుర్రం రఘు, బాబుమియా, చిరంజీవి, హెండిగా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో శారీరక ధృడత్వం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం (నేషనల్ స్పోర్ట్స్ డే )సందర్భంగా బాడ్మింటన్ క్రీడాకారుడు జాతీయ స్థాయిలో రాష్ట్ర స్థాయిలో పలు పథకాలు సాధించిన వెటరన్ క్రీడాకారుడు గుండేటి రమణయ్యను ఘనంగా సన్మానించారు. గుండేటి రమణయ్య తాను క్రీడాకారుడిగా గతంలో, ఇప్పుడు సీనియర్ సిటిజెన్ క్యాటగిరీలో సైతం జాతీయ స్థాయిలో పథకాలు సాధించడం సంతోషమని రామలింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అప్పరాజు రాజు అన్నారు. క్రీడలు శారీరక ఫిట్ నెస్ తోపాటుగా మానసిక సంతులనం కలిగిస్తాయని సన్మాన గ్రహీత గుండేటి రమణయ్య అన్నారు. స్వామి వారి సన్నిధిలో సన్మానం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ అప్పరాజు రాజు, సభ్యులు ఈఓ వెంకట్రావు, ఆలయ ముఖ్య అర్చకులు తనుగుల రత్నాకర్ అయ్యగారు, అర్చకులు పరశు రాం రాజేష్ అయ్యగారు, దేవాలయ సిబ్బంది, స్థానికులు, భక్తులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 22వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ మహేందర్ జీకి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దొగ్గేల తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రంలోని 22వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయని, విద్యాశాఖ 9,370 ఖాళీగా ఉన్నాయని గుర్తించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి 13,086 భర్తీ చేస్తామని, విద్యాశాఖా మంత్రి 6,612 డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని ప్రకటించిందని, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 18,588 ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్ లో ప్రకటించారని, రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటివరకు ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో స్పష్టత లేకుండా పోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అసమర్థత వల్లే ఇప్పటివరకు డీఎస్సీ వేయలేక పోయిందని, చాలామంది బీఈడీ, టీటీసీ పూర్తిచేసుకొని ప్రభుత్వం నిర్వహించిన టెట్ పరీక్షల్లో క్వాలిఫై ఎదురు చూస్తూ ఉంటే, ప్రభుత్వం మాత్రం ప్రకటనల పేరుతో కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వడం లేదని, మరోసారి నిరుద్యోగులను మోసం చేసేందుకే ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు చేస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలను యువత నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక కూడా డీఎస్సీని వేయకపోవడం అంటే అభ్యర్థులను మోసం చేసినట్లేనని అన్నారు. మరోసారి ఎన్నికల్లో గెలిచేందుకు కోసమే డీఎస్సీ ప్రకటన చేస్తుందని, నిరుద్యోగుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే మెగా డీఎస్సీని ప్రకటించి రాష్ట్రంలో ఉన్న 22వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, జిల్లా ఉపాధ్యక్షుడు మంద సుచందర్, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, జిల్లా నాయకులు అనిల్, మాటూరి సతీష్, కుర్ర హర్ష, అనిల్ పాల్గొన్నారు.

# గిరిజనుల హామీలను విస్మరించిన ప్రభుత్వం

## రమావత్ అంజయ్య నాయక్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గిరిజనులకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ అన్నారు. గిరిజన సమాఖ్య హనుమకొండ జిల్లా జనరల్ బాడీ సమావేశం గిరిజన సమాఖ్య అధ్యక్షురాలు ఎల్ రమాదేవి అధ్యక్షతన మంగళవారం బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ మాట్లాడుతూ మొదటి నుంచి గిరిజనులకు మోసం చేస్తున్న కేసీఆర్ కు రాబోయే ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గిరిజనులకు 3ఎకరాల భూమి ఇస్తానని మాట మార్చారని, రాష్ట్రంలోని పోడు భూముల సమస్యలను శాశ్వత పరిష్కారమని చెప్పి కొద్ది మందికి హక్కు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. భూమికి యజమానులు ప్రభుత్వమే కేవలం అనుభవదారులు మాత్రమేనని ఇప్పుడు మాట్లాడుతున్నారని, దీంతో సమస్య మళ్లీ జఠిలమయ్యే ప్రమాదం ఉందన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి గిరిజన రుణాలను ఇవ్వని ముఖ్యమంత్రి గిరిజనుల తలరాత మారుస్తాననటం మోసపూరిత వాగ్దానాలు ప్రపంచంలో కేసీఆర్ ను మించిన ఉచిత హామీల సీఎం ఇంకెవరూ లేరని చరిత్రలో మిగిలిపోతారని అంజయ్య నాయక్ అన్నారు. రాష్ట్రంలో గిరిజన మహిళల పైన దాడులు అఘాయిత్యాలు, పోలీసుల జులుం జరుగుతున్నటువంటి విషయం తెలిసిందే దీనిపైన పూర్తిగా నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలని అంజయ్య నాయక్ అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ జిల్లాల్లో ప్రతి మండలాలలో గిరిజన సమస్యలపైన పోరాటం సాగించాలని, ఇళ్ల స్థలాల కోసం వారి హక్కుల కోసం అదే మారుగా గత మూడు సంవత్సరాల నుంచి సంక్షేమ పథకాలు ఈ వర్గానికి అందటం లేదని దీనిపైన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు సాగించాలని అన్నారు. గిరిజన సమాఖ్య చేసే కార్యక్రమాలకు అన్ని విషయాలలో భారత కమ్యూనిస్టు పార్టీ చేదోడు వాదోడుగా ఉంటుందని అన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టేపాక రవి గిరిజన గీతాలను ఆలపిస్తూ అందరిని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, కేతావత్ రాము, గిరిజన సమాఖ్య నిర్మాణ బాధ్యులు ఎల్లే, గిరిజన నాయకులు అంబి సాంబయ్య, స్వరూప, బుజ్జమ్మ, లక్ష్మి, మంగి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల అకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలం కేంద్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎక్సైజ్ ఎస్సై పద్మ మంగళవారం తనిఖీ చేసి రికార్డులను, మద్యం బాటిళ్లను, నగదును పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో అమ్మకాలు జరిపిన నగదును మరుసటి రోజు క్రమం తప్పకుండా సక్రమంగా బ్యాంకులో జమ చేయాలన్నారు. బ్యాంకులో జమ చేసిన నగదు రశీదులను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం షాపులను నిర్వహించాలన్నారు. అదేవిధంగా రికార్డులలో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలన్నారు. ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసే అమ్మాలన్నారు. మద్యం బాటిళ్లను ఎంఆర్పీ కంటే ఎక్కువకు అమ్మరాదని, అలా అమ్మిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట సిబ్బంది నవీన్, సుజాత, పాష పాల్గొన్నారు.

## నాటక రంగానికి పందిళ్ల శేఖర్ బాబు సేవలు ఎనలేనివి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నాటక రంగానికి పందిళ్ల శేఖర్ బాబు చేసిన సేవలు ఎనలేనివని, ఆ మహానుభావుని జయంతి సందర్భంగా జాతీయస్థాయి నాటికలు ప్రతి ఏడాది, లేదు ఈ సంవత్సరం కూడా నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వనం లక్ష్మీకాంతారావు, ప్రధాన కార్యదర్శి ఆకుల సదానందం తెలిపారు. పందిళ్ల శేఖర్ బాబు స్మారక నాటకోత్సవ కమిటీ సభ్యులు సోమవారం పబ్లిక్ గార్డెన్ నేరెళ్ల వేణుమాధవ్ కళాపరంగణంలో నాటకోత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 2 నుంచి మూడు రోజుల పాటు పబ్లిక్ గార్డెన్ లోని పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో జరిగే ఈ నాటకోత్సవాలకు నాటక ప్రియులు ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు బోయినపల్లి పురుషోత్తమరావు, నిమ్మల శ్రీనివాస్, గూడూరు బాలాజీ, వొడపల్లి చక్రపాణి, నంజీవ రెడ్డి, జీవి బాబు, ముంద్రాతి రవీందర్ తదితరులు కోరారు. ఈ సంవత్సరం పందిళ్ల శేఖర్ బాబు స్మారక పురస్కారాన్ని జీవి బాబుకు (రచయిత, దర్శకులు, నటులు) అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన గుంటోజు స్వరాజ్యం అనే మహిళ మంగళవారం మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకులు మోడెమ్ ఉమేష్ గౌడ్ వారి ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి నివాళులర్పించడంతో పాటు వారి కుటుంబానికి రూ.2000 ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మైస సుమలత భిక్షపతి, రేగొండ బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కోలేపాక భిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, సీనియర్ నాయకులు గోగుల చంద్రశేఖర్, మాడగని రాంచందర్ గౌడ్, మైనార్టీ మండల నాయకులు ఎండీ అక్బర్ బాషా, ఎండీ తాజావుద్దీన్, జిల్లా యూత్ నాయకుడు తడక శ్రీకాంత్ గౌడ్, యూత్ టౌన్ అధ్యక్షుడు మాడగాని నరేష్ గౌడ్, గుంటూజు బుగిలి, గుర్రాల రాజిరెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలో మంగళవారం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ములకనూరి భిక్షపతి ఆధ్వర్యంలో రేగొండ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. రేగొండ మండల నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా మేడిపల్లి భద్రయ్య, గౌరవ అధ్యక్షుడు తూముల రమేష్, ప్రధాన కార్యదర్శి చిన్నరాజు, ఉపాధ్యక్షులుగా కొల్కనూరి రఘుపతి, వల్లోజి రవి, కోశాధికారి పసునోటి కేదారి, వర్కింగ్ ప్రెసిడెంట్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముల్కనూరి భిక్షపతి నాయీ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, నాయీ బ్రాహ్మణులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రేగొండ మండల అధ్యక్షుడు మేడిపల్లి భద్రయ్య మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు ఎంతోమంది నిరుపేదలు, పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కమిటీ హాలు, ఇళ్ల స్థలాలు ఇండ్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు జంపాల జితేందర్, జెట్టి రమేష్, తూముల అశ్విత్, గౌరవ సలహాదారులు తూముల పురుషోత్తం, జంపాల వెంకటస్వామి, ముల్కనూరు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మద్దతు కోరిన ఏఎన్ఎంలు



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ చాలా కీలకమైనదని, అలాంటి శాఖ ఉద్యోగులు గత 14రోజులుగా సమ్మె చేస్తుంటే, ప్రభుత్వం మొద్దు నిద్రపోవడం శోచనీయం అని కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడులు కట్కూరి దేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల నియోజకవర్గంలోని రెండో ఏఎన్ఎంలు సెప్టెంబర్ 2న జరిగే సమ్మెకు మద్దతు ఇవ్వాలని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలసి మెమోరడం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కట్కూరి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యశాఖ చాలా కీలకమైందని అందులో పని చేసే వారందరికీ న్యాయం చేయాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ గద్దెనెక్కి ప్రతి ఒక్క ఉద్యోగికి న్యాయం చేస్తుందని, ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కాలని కోరుకుంటున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు సునీత, రజిత, భాగ్యలక్ష్మి, కరుణ, కల్పన, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ జిల్లా రూరల్ సబ్ రిజిస్ట్రార్ గా నియామకమైన మొహమ్మద్ మసీయుద్దీన్ ను ఆయన కార్యాలయంలో శాలువా, పూల బొకేతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ జన్ను భాస్కర్, జూడో ఫెడరేషన్ అఫ్ ఇండియా, కోశాధికారి భైరబోయిన కైలాష్ యాదవ్, లయన్స్ క్లబ్ అఫ్ కాజీపేట అధ్యక్షుడు డాక్టర్ పీవీ. మల్లికార్జున్ రావు, క్రీడాకారుడు దుబ్బా రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రీడా దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** జిల్లా పరిషత్ హై స్కూల్ కొత్తకొండలో ఘనంగా క్రీడా దినోత్సవ వేడుకలు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధ్యాన్ చంద్ హాకీ మాంత్రికుడు భారతదేశానికి మూడు సార్లు 1928, 1932, 1936 లో జరిగిన ఒలింపిక్స్ లో భారతదేశానికి బంగారు పతాకం అందించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల గణిత అధ్యాపకుడు అజ్మీరా సర్దార్ కబడ్డీ క్రీడాకారుల కోసం కబడ్డీ దుస్తులు రూ.5000 రూపాయలు విలువ కబడ్డీ కిట్ పిల్లలకు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం సునీత రాణి పాఠశాల విద్యార్థులఅందరికి రాగి జవా తాగడానికి గిన్నెలు బహుమతిగా అందించారు. అనంతరం ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ మండల స్థాయిలో నిర్వహించిన గేమ్స్ లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, సర్దార్, శ్రీధర్, చారి, దయాకర్, కృష్ణమూర్తి, మల్లేశం, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కెప్టెన్ మిల్లర్‌లో నాగ్ కీలక భూమిక





సార్‌తో తెలుగులో యాభై కోట్ల రేంజ్‌లో కలెక్షన్‌లు కొల్లగొట్టి తిరుగులేని మార్కెట్‌ను పెంచుకున్నాడు ధనుష్. ప్రస్తుతం ఆయన సినిమాలకు ఇక్కడ మాములు గిరాకీ లేదు. కెప్టెన్ మిల్లర్ కోసం ఇప్పటి నుంచే తెలుగు నిర్మాతలు కాచుకొని చూస్తున్నారు. డబ్బింగ్ హక్కుల కోసం ఎంతైనా పెట్టడానికి రెడీగా ఉన్నారు. ఇక శేఖర్ కమ్ములతో చేయబోయే సినిమాకైతే మాములు ఎక్స్‌పెక్టేషన్స్ లేవు. ధనుష్ బర్త్‌డే సందర్భంగా రిలీజైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌కు మాములు రెస్పాన్స్ రాలేదు. ఓ వైపు ఆకాశ హర్మ్యాలు, మరోవైపు మురికి వాడాలు, వాటి మధ్యలో నోట్ల కట్టలతో పోస్టర్‌ను డిజైన్ చేసి సినిమా థీమ్ ఎంటో చెప్పేశారు. దాంతో ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్ మీదకు వెళ్తుందా అని అమితాసక్తితో ఎదురు చూస్తున్నారు. ఇక తాజాగా మేకర్స్ మరో బిగ్ అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ సినిమాలో అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. సినిమా మొత్తం నాగ్ చుట్టే తిరుగుతుందని తెలుస్తుంది. ఇక సినిమా నిర్మాతల్లో ఒకరైన ఏషియన్ సునీల్‌కు నాగార్జునకు మధ్య ఎప్పటి నుంచో మంచి బాండింగ్ ఉంది. పైగా శేఖర్ కమ్ములా సైతం చైతన్యతో లవ్‌స్టోరీ చేశాకా అక్కినేని ఫ్యామిలీకి చాలా దగ్గరయ్యాడు. దాంతో ఈ సినిమాలో కీలకపాత్ర చేయడానికి నాగ్ మరోమారు ఆలోచించకుండా ఒప్పేసుకున్నాడట. ఇక ఈ సినిమాలో ధనుష్‌కు జోడీగా రష్మిక నటిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. రేపో మాపో సెట్స్ మీదకు కూడా వెళ్లనుంది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇక మరోవైపు నాగ్ తన కొత్త సినిమాను ప్రకటించేశాడు. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బన్నీను దర్శకుడిగా ఇంట్రడ్యూస్ చేస్తూ నా సామిరంగా అనే అవుట్ అండ్ అవుట్ మాస్ సినిమా చేస్తున్నాడు. తాజాగా రిలీజైన టీజర్‌కు వీర లెవల్లో రెస్పాన్స్ వస్తుంది. ఎమ్.ఎమ్ కీరవాణి స్వరాలందిస్తున్న ఈ సినిమాలో పలాస దర్శకుడు కరుణ కుమార్ విలన్‌గా కనిపించబోతున్నాడు. సంక్రాంతిని టార్గెట్‌గా పెట్టుకున్న ఈ సినిమాను శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్నాడు. ఇక ఇన్ని రోజులు నాగ్ నుంచి సినిమా రావడం లేదంటూ నిరాశలో ఉన్న ఫ్యాన్స్‌కు నాగార్జున డబుల్ ట్రీట్ ఇచ్చాడు.




# కుర్రహీరో కవిన్ ఎంట్రీ

కోలీవుడ్ యంగ్ హీరో కవిన్ అంటే ఎవరికీ తెలిసి ఉండదు కానీ.. బిగ్ బాస్ ఫేమ్, దాదా మూవీ హీరో కవిన్ అంటే అందరు గుర్తుపడతారు. దాదా సినిమాతో తమిళంలో భారీ హిట్ అందుకున్నాడు ఈ కుర్ర హీరో. ఈ మూవీ ఓటీటీలో లో కూడా విడుదలై రికార్డు వ్యూస్ సాధించింది. తాజాగా ఈ నటుడు కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేశాడు. ప్యార్ ప్రేమ కాదల్ ఫేమ్ దర్శకుడు ఎలాన్ తో తన తదుపరి చిత్రం చేయబోతుండగా ఈ చిత్రానికి స్టార్ అనే టైటిల్ ఖరారు చేశారు. ఇక ఈ చిత్రాన్ని తమిళ ప్రొడక్షన్స్ రైస్ ఈస్ట్ ఎంటర్‌టైనమెంట్స్ టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్స్ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ మూవీకి సంబంధించి స్పెషల్ ప్రోమోను ఆగస్టు 31న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ ప్రకటించారు. కాగా ఈ సినిమాకు కోలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్ రాజా సంగీతం, అందించనున్నాడు.



# 31న షారుఖ్ జవాన్ ట్రైలర్



షారుఖ్ జవాన్‌పై రోజురోజుకు అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. సరిగ్గా తొమ్మిది రోజుల్లో ఈ పాటికి థియేటర్‌లు దద్దరిల్లుతుంటాయి. పైగా తెలుగు ప్రేక్షకులకు బాగా పరిచయమున్న అట్లీ ఈ సినిమా తెరకెక్కించడంతో ఓ రేంజ్‌లో అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రమోషన్ల పనిలో పడిపోయింది. హిందీ సహా తమిళ, తెలుగు భాషల్లో పెద్ద ఎత్తున రిలీజ్ కాబోతున్న ఈ సినిమాకు అట్లీ దర్శకత్వం వహించాడు. అప్పుడెప్పుడో రిలీజైన ఫస్ట్‌లుక్ పోస్టర్ నుంచి రీసెంట్‌గా రిలీజైన సెకండ్ సింగిల్ వరకు ప్రతీది సినిమాపై అంతకంతకూ అంచనాలు పెంచుతూ వస్తున్నాయి. ఇక త్వరలోనే చెన్నైలో ప్రీ రిలీజ్ వేడుకను గ్రాండ్ లెవల్లో ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత తెలుగు, హిందీలో ప్రెస్ మీట్‌లు నిర్వహించేలా ప్లాన్ చేసుకుంటుంది. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా ట్రైలర్‌ను ఆగస్టు 31న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే అదే రోజున చెన్నైలో ఓ గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించి అక్కడే ట్రైలర్ రిలీజ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తుంది. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. షారుఖ్‌కు జోడీగా నయనతార నటించింది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే గెస్ట్ అప్పియరెన్స్ ఇవ్వనుంది.ఇక ఇప్పటికే ఈ సినిమా థియేట్రికల్, నాన్ థియేట్రికల్ హక్కులన్ని కలుపుకుని భారీ స్థాయిలో బిజినెస్ జరిగిందని, విడుదలకు ముందే సినిమాకు మూడొందల కోట్లు లాభాలు వచ్చాయని బాలీవుడ్ మీడియా టాక్.

# వ్యాపారులకు ప్రభుత్వం అండ



## నగర సుందరీకరణలో భాగస్వాములు కావాలి
## ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, వార్తక సంఘముల ప్రతినిధులతో రోడ్డు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గతంలో ఆటో డ్రైవర్లు, స్ట్రీట్ వెండర్స్ ను పోలీసులు ఇబ్బందులకు గురి చేసే వారని, కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో ఫ్రెండ్లీ వాతావరణాన్ని తీసుకొచ్చామన్నారు. వ్యాపారులు నగరం సుందరీకరణలో భాగస్వాములు కావాలన్నారు. నగరంలోని కొన్ని ప్రదేశాల్లో స్ట్రీట్ వెండర్స్ జోన్ ఏర్పాటు చేశామని, అక్కడే వారు వ్యాపారాలు కొనసాగిస్తూ ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని కోరారు. ఆటో డ్రైవర్స్ ప్రైవేటు ఫైనాన్స్ వారి నుంచి అధిక వడ్డీకి అప్పులు తీసుకుని తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలా కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందని వాటిపై అవగాహన పెంచుకొని లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఇలాంటి అవగాహన సదస్సులతో క్షేత్రస్థాయిలో ఉండే సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తుందన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ వాహనదారులకు ఫైన్ వేయడం కంటే ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ఏరియా వారిగా కోఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటు చేసుకుని సమస్యలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మునిసిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, కూడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, డీఎస్పీ బారి, మైనార్టీ కమిషన్ సభ్యుడు దర్శన్ సింగ్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధిలు, ఆటో డ్రైవర్ యూనియన్ ప్రతినిధులు, చిరు వ్యాపారుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్ల బావి పునరుద్ధరణకు చర్యలు

## మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య
## క్షేత్ర స్థాయిలో పరిశీలన



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** బల్దియా పరిధి 34వ డివిజన్ శివనగర్ లోని కాకతీయుల చారిత్రక నేపథ్యం కలిగిన మెట్ల బావి పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నట్లు నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. మంగళవారం కమిషనర్ షేక్ రిజ్వానా బాషా, హైదరాబాద్ కు చెందిన టెక్నికల్ ప్రతినిధులతో కలిసి వారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మెట్ల బావి ప్రాంతంలో కలియ తిరిగి సాంకేతికతో, సాంప్రదాయకమైన పద్ధతిలో చేపట్టాల్సిన నవీకరణ చర్యలపై చర్చించారు. సాంకేతిక బృందం సూచనలు పరిగణనలోకి తీసుకొని పునరుద్ధరణకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా మెట్ల బావిలో డి-సిల్టింగ్, అభివృద్ధి ప్రక్రియను వెంటనే చేపట్టాలని మేయర్, కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమార స్వామి, టెక్నికల్ టీం సభ్యులు కల్పన రమేష్, వెంకటేష్, వాత్సల్య, ఈఈ శ్రీనివాస్, డీఈ రవి కిరణ్, తహశీల్దార్ నాగేశ్వర్ రావు, ఏఈ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



# సంచార కులాలకు గుర్తింపు

## వకుళాభరణం కృష్ణ మోహన్ రావు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సంచార, అర్ధ సంచార, విముక్త కులాలు, జాతులు, ఎంబీసీలకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది, ఆ వర్గాలలో ఆత్మ గౌరవాన్ని పెంపొందించింది తెలంగాణ ప్రభుత్వమేనని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. భిన్నాభిప్రాయాలు ఉండడం ప్రజాస్వామ్య హితమే, అయితే సమాజం హర్షించని రీతిలో ప్రభుత్వంపై పనిగట్టుకొని విమర్శలు చేయడం శ్రేయోదాయకం కాదని ఆయన సూచించారు. విముక్త జాతుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సంచార జాతుల సంఘం మంగళవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు ఒంటెద్దుల నరేందర్ సభాధ్యక్షత వహించగా రాష్ట్ర ఎంబీసీ ఆర్థిక కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు తాడూరి శ్రీనివాస్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆచార్యులు మురళి మనోహర్, ఐ.తిరుమలి, సింహాద్రి యాదవ్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, వివిధ ప్రజా సంఘాల, కుల సంఘాల, వేదికల ప్రతినిధులు గడ్డం వెంకన్న, చెవ్వ రాజయ్య, కర్నె శివకుమార్, ఆకురాతి మురళి కృష్ణ, వీరాస్వామి, యాదగిరి, భూపతి సాగర్, వెన్నెల నాగరాజు, ఢిల్లీ యాదగిరి రావు, వెంకట నారాయణ, బండారి యువరాజ్, పన్నీరు నాగేశ్వర్ రావు, తిపిరిశెట్టి శ్రీనివాస్, జిడ్డి కనకయ్య, వివిధ సంచార కులాల, సంఘాల, జాతుల నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు వీడ్కోలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా నూతన ఎస్పీగా గుండేటి చంద్రమోహన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గౌరవ వందనం స్వీకరించి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఎస్పీగా పదవి బాధ్యతలు చేపట్టిన చంద్రమోహన్ కు జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పూల మొక్కలు, బొకేలు అంద చేసి అభినందనలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీగా పనిచేసి బదిలీ పై వెళుతున్న శరత్ చంద్ర పవార్ కు అరుదైన గౌరవం దక్కింది. అయన తో పెనవేసుకున్న అమితమైన తమ అభిమానాన్ని అనుబంధాన్ని పోలీస్ సిబ్బంది చాటుకున్నారు. శరత్ చంద్ర పవర్ బదిలీ పై తెలంగాణ పోలీస్ స్టేట్ అకాడమీకి వేళు తుండడంతో పోలీసులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీని పోలీస్ సిబ్బంది భుజాలపై ఎత్తుకొని పూలతో అలంకరించిన ఓపెన్ టాప్ జీప్ వాహనంలో కూర్చోబెట్టి ఆ వాహనాన్ని పోలీస్ సిబ్బంది తాడుతో లాగుతూ ఊరేగింపుగా వీడ్కోలు పలికారు.

# పెండింగ్ స్కాలర్ షిప్ విడుదల చేయాలి

## ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం
## మంత్రి కార్యాలయం ముట్టడికి యత్నం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పెండింగ్ లో ఉన్న రూ.5,300 కోట్ల స్కాలర్ షిప్ లు, ఫీజు రియంబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలనే డిమాండ్ లతో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్రశాఖ పిలుపుమేరకు పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఏబీవీపీ కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేసీఆర్ ప్రభుత్వం మద్యం టెండర్ ల నిర్వహణ మీద ఉన్న శ్రద్ధ టిఎస్పీ ఎస్సీ పరీక్షల నిర్వహణ మీద లేదని ఆరోపించారు. అందుకే ప్రతి పేపర్ లీక్ అవుతోందన్నారు. సంక్షేమ హాస్టల్లలో ఆహారం సదుపాయలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను వెంటనే ఏర్పాటు చెయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమంలో పోలీసులతో జరిగిన తోపులాటలో పలువురు విద్యార్థి నాయకులకు గాయాలయ్యాయి. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్స్ హర్షవర్ధన్, వెలుపల రాజు కుమార్, జిల్లా కన్వీనర్ దేవేందర్, మహానగర్ కార్యదర్శి సుజిత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుణ్, భాను, కౌశిక్, శ్రీనివాస్, భరత్, శ్రవణ్ కుమార్, జస్వంత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com